సాక్షి
ఖమ్మం

శనివారం । 1 । జూలై । 2023



సాధారణంలో సగం కూడా లేదు

జూన్ నెలలో సాధారణంలో సగం కూడా వర్షపాతం నమోదు కాలేదు. దీంతో పంటల సాగు జోరందుకోవడం లేదు.

IIలో



119 శాతం బొగ్గు ఉత్పత్తి

సింగరేణి కొత్తగూడెం ఏరియాలో జూన్ నెలలో లక్ష్యానికి మించి బొగ్గు ఉత్పత్తి నమోదైందని అధికారులు తెలిపారు.

IIలో

గరిష్టం / కనిష్టం
35° / 27°

వాతావరణం

జిల్లా అంతటా శనివారం ఎండలు ఎక్కువగానే ఉంటాయి. రాత్రి వరకు కొన్ని చోట్ల చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

గ్రూప్‌-4 పకడ్బందీగా నిర్వహించండి

- అధికారులతో సమీక్షలో గౌతమ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: టీఎస్‌పీఎస్‌సీ ఆధ్వర్యాన శనివారం నిర్వహిస్తున్న గ్రూప్‌-4 పరీక్షలు పకడ్బందీగా జరిగేలా పర్యవేక్షించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అధికారులను ఆదేశించారు. ఖమ్మంలోని టీటీడీసీ సమావేశ మందిరంలో శుక్రవారం రాత్రి గ్రూప్‌-4 పరీక్షల నిర్వహణపై రూట్ ఆఫీసర్లు, లైజన్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లో తాగు నీరు, సైన్‌బోర్డులు ఏర్పాటుచేయటంతో పాటు టాయిలెట్ల సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతీ అభ్యర్థికి మధ్య కనీసం దూరం ఉండేలా సీటింగ్ ఏర్పాటుచేయాలని, పరీక్ష పూర్తయ్యే వరకు అభ్యర్థులను బయటకు పంపించొద్దని సూచించారు. అలాగే, కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ ద్వారా సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్, డీఆర్వో శిరీష తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచండి



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

సత్తుపల్లిటౌన్: ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు వంద శాతం హాజరయ్యేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని జిల్లా విద్యా శాఖాధికారి సోమశేఖరశర్మ ఆదేశించారు. సత్తుపల్లిలోని గ్రూప్‌-4 పరీక్షా కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆతర్వాత ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో సమావేశమై మాట్లాడారు. విద్యార్థులంతా పాఠశాలకు వచ్చేలా చూస్తూ పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఇప్పటి నుంచే ప్రణాళిక అమలు చేయాలని సూచించారు. ఎంఈఓ రాములు, హెచ్‌ఎం యాకోబు, ఎన్‌సీసీ అధికారి షాకీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్టిఫికెట్ల పరిశీలన

ఖమ్మం సహకారనగర్: ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు చేపట్టిన ఎంసెట్ కౌన్సెలింగ్ కొనసాగుతోంది. ఈమేరకు శుక్రవారం ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాల సెంటర్‌లో స్లాట్ బుక్ చేసుకున్న 800మందిలో 798మంది హాజరయ్యారు. ఈసందర్భంగా వారి సర్టిఫికెట్లు పరిశీలించినట్లు కౌన్సెలింగ్ కేంద్రం కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం తెలిపారు.

బోధన సిబ్బంది భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: ఖమ్మం రీజియన్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో తాత్కాలిక ప్రాతిపదికన బోధన సిబ్బందిని భర్తీ చేయనున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు తెలిపారు. డిగ్రీ లేదా పీజీలో 55శాతం మార్కులతో పాటు బీఈడీ పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. అర్హులైన వారు 3 నుంచి 7వ తేదీ వరకు భద్రాచలంలోని ఐటీడీఏ సమన్వయ అధికారి కార్యాయలంలో దరఖాస్తులు అందజేయాలని, మార్కులు, డెమోలో ప్రతిభ ద్వారా ఎంపిక ఉంటుందని వెల్లడించారు. కాగా, మహిళా విద్యాలయాల్లో మహిళలకు మాత్రమే అవకాశమిస్తామని పీఓ తెలిపారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన



మొక్క నాటుతున్న అధికారులు

వైరా: 'రహదారి భద్రత, జీవితానికి రక్ష' నినాదంతో వైరాలో రోడ్డు ప్రమాదాల నివారణపై అధికారులు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్ సేఫ్టీ మేనేజర్ మహేంద్ర వాజ్‌పాయ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. మద్యం సేవించడంతో పాటు నిబంధనలు పాటించకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. అనంతరం పోలీస్‌స్టేషన్ వద్ద మొక్క నాటారు. వైరా ఎస్సై మేడా ప్రసాద్, అధికారులు లోకేందర్‌సింగ్, మురళీమోహన్, సంతోష్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడే పోడు పట్టాలు అత్యధికం

- గిరిజన సంక్షేమానికి పాటుపడేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే
- గతంలో సగం మందికే పోడు పట్టాలు
- కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన ఏ హామీ అమలు కాలేదు
- పోడు పట్టాల పంపిణీలో మంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, స్పెషల్ సీఎస్ రామకృష్ణారావు, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, ఎమ్మెల్యే రాములునాయక్



మహిళా రైతుకు పాస్‌పుస్తకం అందజేస్తున్న మంత్రులు హరీశ్‌రావు, అజయ్

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పోడు సాగుదారులకు పట్టాలు ఇవ్వడం ద్వారా పది రకాలుగా లబ్ధి జరగనుందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు వెల్లడించారు. తెలంగాణలోనే అత్యధికంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పోడు పట్టాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో 30 మంది పోడుసాగుదారులకు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి హరీశ్‌రావు పట్టాలు పంపిణీ చేశాక మాట్లాడారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో సీఎం కేసీఆర్ గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట వేశారని, పట్టాలు అందుకుంటున్న పోడు సాగుదారులకు అడగకుండానే రైతుబంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్, సబ్సిడీ పై ఎరువులు, వ్యవసాయ పనిముట్లు, నష్టపరిహారం తదితర లబ్ధి అందించనున్నారని వివరించారు. వారం, పది రోజుల్లో పోడు పట్టాలు అందుకున్న గిరిజన రైతులకు రైతు బంధు సాయం ఖాతాల్లో జమ అమవుతుందని ఆయన తెలిపారు.

6,589 మందికి..

రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేసిన రైతులకు ఇక నుండి రైతు బంధు, ఉచిత విద్యుత్ పథకాన్ని వర్తించే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని హరీశ్‌రావు వివరించారు. కాంగ్రెస్ హయంలో 3 లక్షల మందికి పోడు పట్టాలు ఇచ్చారని, సీఎం కేసీఆర్ అర్హులందరికీ ఇస్తున్నారని, జిల్లాలో 6,589 మంది పోడు రైతులకు పట్టాలు మంజూరయ్యారని తెలిపారు.

గిరిజన సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

గిరిజన విద్యార్థుల కోసం రాష్ట్రంలో రెసిడెన్షియల్ పాఠశాలలు, గురుకులాలను ప్రభుత్వం ఏర్పాటు చేసి ఆరు లక్షల మంది విద్యార్థులకు విద్య అందిస్తున్నామని హరీశ్ తెలిపారు. దేశంలోనే మొట్టమొదటి గిరిజన లా కళాశాల ఏర్పాటు చేసింది తెలంగాణ ప్రభుత్వమేనన్నారు. గూడేలను, తండాలను పంచాయతీలుగా మార్చి వారికి పాలనను దగ్గర చేశామని పేర్కొన్నారు. అలాగే, గిరిజనుల సంక్షేమానికి కట్టుబడిన కేసీఆర్ ప్రభుత్వం 10 శాతం రిజర్వేషన్ కల్పించిందని చెప్పారు.

ప్రాజెక్టులు మధ్యలోనే నిలిపివేశారు..

కాంగ్రెస్ హయాంలో చేపట్టిన ఏ ప్రాజెక్టునూ పూర్తి చేయలేదని, జలయజ్ఞాన్ని ధనయజ్ఞంగా మార్చారని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రాజెక్టులను పూర్తి చేయకుండా మధ్యలోనే నిలిపివేశారన్నారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి దిగువ సీలేరును తెలంగాణకు కాకుండా చేశాయని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను ఆంధ్రాలో కలిపాయని ఆరోపించారు. అయితే, కాళేశ్వరం పూర్తిచేయడంతో పాటు చేపట్టిన ప్రతీ ప్రాజెక్టును చివరిదాకా తీసుకెళ్లి రైతులకు సాగు నీరు అందించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందని తెలిపారు.

అరవై ఏళ్లలో ఏం చేశారు?

జిల్లాకు వచ్చి మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ 60 ఏళ్ల పాలనలో తెలంగాణకు ఏం మంచి పనిచేసిందో చెప్పాలని హరీశ్‌రావు సూచించారు. కాంగ్రెస్ పాలనలో సాగుకు నీరు, విద్యుత్ ఇవ్వకపోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. కాంగ్రెస్ పాలిస్తున్న రాష్ట్రాల్లో ఆసరా పింఛన్లు,రైతుబంధు, రైతుబీమా పథకాలు, కల్యాణలక్ష్మి, మిషన్ భగీరథ అమలుచేస్తున్నారో చెప్పాలని సూచించారు. కాంగ్రెస్ పాలనలో రైతులు కరెంట్ సబ్ స్టేషన్ల ముందు ధర్నాలు చేయలేదా, నేతన్నలు ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యలు చేసుకోలేదా.. అనే ప్రశ్నలకు ఖమ్మం వస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సమాధానం చెప్పగలరా అని అన్నారు.

వెన్నుపోటు పొడిచే వాళ్లు వెళ్లిపోయారు

జిల్లాలో పార్టీకి పట్టిన పీడ విరగడ అయిందని, శకుని పాత్రలు వెళ్లిపోయాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. పార్టీలో ఇంత కాలం ఉన్నా పార్టీకి, నేతలకు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. అలాంటి వారిని పక్కనపెడితే కాంగ్రెస్ తీసుకుంటోందని.. అరాచక వాది అని అన్నోళ్లను ఇప్పుడు భట్టి చేర్చుకుంటున్నాడని విమర్శించారు. ఇంతకు ముందు ఉమ్మడి ఖమ్మంలో ఒక సీటు గెలిచి, తొమ్మిది ఓడినా.. ఈసారి అంతా తారుమారు అవుతుందని హరీశ్ ధీమా వ్యక్తం చేశారు.

జిల్లాలో దొంగలు పడ్డారు..

– మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

జిల్లాలో దొంగలు పడుతున్నారని.. మళ్లీ పాత కథలు చెప్పి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఇందిరాసాగర్, రాజీవ్‌సాగర్, నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ ప్రాజెక్టుల పేరుతో మరోసారి మోసగించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. పోడు భూములకు పట్టాలు ఇచ్చేందుకు యూపీఏ ప్రభుత్వం చట్టం తీసుకొచ్చినా సంపూర్ణంగా ఇవ్వలేదన్నారు. ఒకవేళ వారు ఇచ్చి ఉంటే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నేడు 1.63 లక్షల ఎకరాలకు పట్టాలు ఇచ్చే అవకాశం బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి దక్కేది కాదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో పది స్థానాలు గెలిపించుకొని కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ పోడు సాగుదారులపై ఉన్న కేసులను పరిష్కరించబోతున్నట్లు తెలిపారు. చిన్న తరహా పరిశ్రమలకు తెలంగాణ ప్రభుత్వం ఊపిరి పోసిందని, కరోనా తర్వాత కొన్ని పరిశ్రమలు మూతపడ్డాయని వాటిని తెరిపించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. తొలుత రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రామకృష్ణరావు, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు రాములునాయక్, హరిప్రియ, మేయర్ పునుకొల్లు నీరజ, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, రైతుబంధు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు బానోత్ చంద్రావతి, మదన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం నుంచే సమరశంఖం



మాట్లాడుతున్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి. పక్కన మాజీ ఎంపీలు వీహెచ్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మధుయాష్కీ గౌడ్, పోరిక బలరాంనాయక్ తదితరులు

- బస్సులు ఇచ్చినా, ఇవ్వకున్నా సభను విజయవంతం చేస్తాం
- ఈ సభతోనే బీఆర్‌ఎస్ పాలనకు సమాధి
- పార్టీలో పాత, కొత్త నేతలంతా కలిసి పని చేస్తాం
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

ఖమ్మంసహకారనగర్: ఖమ్మంలో ఆదివారం జరిగే తెలంగాణ జనగర్జన సభ ద్వారానే ఎన్నికల సమర శంఖం పూరిస్తున్నామని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదికి పది సీట్లు గెలవడంతోపాటు రాష్ట్రంలో 80కి పైగా సీట్లు దక్కించుకుంటామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఖమ్మం వచ్చిన ఆయన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి జనగర్జన సభ ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే, డీసీసీ కార్యాలయంలో నేతలతో సభ ఏర్పాట్లపై సమీక్షించారు. ఆయా సమావేశాల్లో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ జనగర్జన సభను చిన్నదిగా చూపాలని ప్రయత్నాలు జరుగుతుండగా.. రకరకాల కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఏదిఏమైనా సభ కనీ విని ఎరగని రీతిలో విజయవంతమవుతుందని తెలిపారు. ఈ సభలోనే మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నుచరుల చేరిక, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర ముగింపు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

పొంగులేటి మూడో కన్ను...

సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, రేణుకా చౌదరి జిల్లాకు రెండు కళ్ల లాంటి వారని రేవంత్ తెలిపారు. ఇక పొంగులేటి శ్రీనివాసరెడ్డి మూడో కన్ను లాంటి వాడని, శివుడు మూడో కన్ను తెరిస్తే ఏమవుతుందో బీఆర్‌ఎస్ పరిస్థితి కూడా అంతే ఉంటుందన్నారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యాన నిర్వహించిన సభ కంటే కాంగ్రెస్ సభకు అధిక సంఖ్యలో జనం వస్తారని రేవంత్ పేర్కొన్నారు. రూ.2 కోట్లు చెల్లించి జనాల కోసం ఆర్టీసీ బస్సులు సమకూర్చాలని భావించినా అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు. అయినా ఆటోలు, కార్లు, సైకిల్ మోటార్లపై.. లేకపోతే నడుస్తూ వస్తారన్నారు. ఏది ఏమైనా ఖమ్మం సభతో బీఆర్‌ఎస్ పాలనకు సమాధి కడతామని పేర్కొన్నారు.

అన్ని సీట్లూ మావే

జిల్లా ప్రజలు విజ్ఞులని ఈసారి కేసీఆర్ మాయమాటలను నమ్మరని రేవంత్‌రెడ్డి తెలిపారు. గత రెండు ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఒక సీటు ఇచ్చినా ఈసారి అదీ ఇవ్వరని చెప్పారు. ఇందుకోసం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. కాగా, నాలుగైదు నెలలుగా పొంగులేటితో కాంగ్రెస్‌లో చేరికపై చర్చలు జరిపామని తెలిపారు. కార్యకర్తలు, అభిమానులతో చర్చించాకే తనకు కష్టమైనా, నష్టమైనా అభిమానుల అభిప్రాయానికి ప్రాధాన్యం ఇచ్చారని చెప్పారు. ఖమ్మం గడ్డపై ఇక కారు గుర్తు ఉండదని, బంగాళాఖాతంలో కలిపేస్తామని పేర్కొన్నారు. పార్టీ సీనియర్ నాయకులు మధుయాష్కీ గౌడ్, వి.హన్మంతరావు మాట్లాడుతూ ఖమ్మం సభ ఎన్నికలకు ఒక శంఖారావమని తెలిపారు. పార్టీలో ప్రతి ఒక్కరికి స్వేచ్ఛ ఉందని.. ఎవరూ అభద్రతకు గురికాకుండా సమన్వయంతో అధికారమే లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు.

చెక్‌పోస్టులు.. నీటి సరఫరా బంద్

మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సభకు అభిమానులు, ప్రజలు రాకుండా అడ్డుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారని విమర్శించారు. ఖమ్మం పరిసర ప్రాంతాల్లో చెక్‌పోస్టులను సైతం ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. చివరకు శుక్ర, శనివారాల్లో ఇవ్వాల్సిన తాగునీరు ఆపేసి ఆదివారం సాయంత్రం 4గంటలకు ఇస్తున్నారన్నారు. ఇంకా ఈ సమావేశంలో మాజీ ఎంపీలు బలరాం నాయక్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు పొదెం వీరయ్య, సీతక్క, నాయకులు మల్లు రవి, వంశీకృష్ణ, శోభారాణి, అన్వేష్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో పాటు సునీతరావు, కొండా మురళి, రోహిత్‌చౌదరి, అన్వేష్‌రెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు. కాగా, సభకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరుకానున్న నేపథ్యాన విజయవంతం చేసేందుకు ఇన్‌చార్జ్‌లను నియమించారు. ఈమేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ బి.మహేష్‌కుమార్ గౌడ్ ఇన్‌చార్జ్‌ల వివరాలను వెల్లడించారు.

ప్రతీ అడుగులో ప్రజల కష్టాలు కనిపించాయి

- 'పీపుల్స్‌మార్చ్'లో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- 1,360 కి.మీ.కు చేరిన పాదయాత్ర
- పైలాన్‌ను ఆవిష్కరించిన గద్దర్

కూసుమంచి(ఖమ్మం రూరల్): ఆదిలాబాద్ నుంచి తాను చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర ప్రతీ అడుగులో ప్రజల కష్టాలు కనిపించాయని.. తెలంగాణ సాధించుకున్న ఆశయం, లక్ష్యం నెరవేరలేదనే ఆవేదన ప్రజల్లో ఉందని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శుక్రవారం రాత్రి ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు నుండి ప్రారంభమై కోదాడ క్రాస్‌రోడ్ వద్ద ముగిసింది. భట్టి పాదయాత్ర 1,360 కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా కిట్స్ కళాశాల వద్ద నిర్మించిన పైలాన్‌ను ప్రజాయుద్ధనౌక గద్దర్ ఆవిష్కరించారు. పాటలు పాడి జనాన్ని ఉత్సాహపరిచారు. అనంతరం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో భట్టి మాట్లాడారు.

కష్టాలు చెప్పుకున్నారు...

రాష్ట్రంలోని 17 జిల్లాలు, 36 నియోజకవర్గాల్లో తన పాదయాత్ర సాగగా... ప్రజలు మమేకమై కష్టాలను చెప్పుకున్నారని భట్టి తెలిపారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజలు పడుతున్న కష్టాలు ఆవిష్కృతమయ్యాయని అన్నారు. ఈ సమస్యలు, బాధలు దూరం కావాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారని భట్టి చెప్పారు. ఖమ్మంలో ఈనెల 2న జరిగే రాహుల్ సభకు ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా లక్షలాది మందితో విజయవంతం చేస్తామని తెలిపారు. మాజీ ఎంపీ వి.హన్మంతరావు మాట్లాడుతూ మండుతున్న ఎండను లెక్కచేయకుండా ప్రజల కోసం భట్టి పాదయాత్ర చేశారని చెప్పారు. రాష్ట్రంలో కేసీఆర్ దొరపోకడలకు కాలం చెల్లిందన్నారు. ఈకార్యక్రమంలో భట్టి సతీమణి నందినితో పాటు ఎమ్మెల్యే పోదెం వీరయ్య, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీపీపీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, నాయకులు బెల్లయ్య నాయక్, కత్తి వెంకటస్వామి, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, జావీద్, కళ్లెం వెంకటరెడ్డి, మద్ది వీరారెడ్డి, బైరు హరినాథ్, రవి తదితరులు పాల్గొన్నారు.



పైలాన్ వద్ద భట్టి విక్రమార్క అభివాదం, పక్కన గద్దర్, వీహెచ్ తదితరులు

ప్రాణదాతలకు ప్రణామం!



వరద దాటి వెళ్తున్న డాక్టర్ మౌనిక, సిబ్బంది (ఫైల్)

- వైద్యుల చేయి పడితే శరీరానికి చికిత్స.. మనసుకు స్వాంతన
- కష్టకాలంలో ప్రజలకు అండగా సేవలు
- మారుమూల, ఏజెన్సీ పల్లెవాసుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

నేడు జాతీయ వైద్యుల దినోత్సవం

భద్రాచలం అర్బన్: పోయే ప్రాణాన్ని నిలిపే శక్తి వైద్యుల సొంతం. అనారోగ్యంతో బాధపడేవారు వైద్యుల చెంతకు చేరగానే సగం ఊరట చెందుతారు. వైద్యులు ఇచ్చే మందులు, అంతకు మించి వారి నోట వచ్చే మంత్రం లాంటి మాటలు వ్యాధులను ఇట్టే నయం చేస్తాయి. అందుకే వైద్యులను ఇలలో దేవతలుగా భావిస్తారు. నేడు జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా కథనం.

డాక్టర్స్ డే నేపథ్యం

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ బీ.సీ.రాయ్ కోల్‌కతా మెడికల్ కాలేజీ, లండన్‌లో వైద్య విద్య పూర్తిచేశాక స్వదేశానికి వచ్చి సేవలు ప్రారంభించారు. కలకత్తా మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్‌గా పని చేయడమేకాక మహాత్మాగాంధీతో కలిసి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం 1961లో భారతరత్నతో సత్కరించింది. ఆయన జయంతి, వర్ధంతి రోజైన జూలై 1న జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహిస్తున్నారు.

పవిత్రమైన వృత్తి

సమాజంలో అత్యంత పవిత్రమైన, కీలకమైన వృత్తి వైద్యం. ఆపద సమయంలో ప్రజలందరికీ ఆపద్బాంధవుడిలా కనిపించే వైద్యులను ప్రజలు గౌరవిస్తారు. సాక్షాత్తు దేవుల్లా కొలుస్తారు. ఇతరుల ప్రాణాలు నిలిపే అవకాశం డాక్టర్ వృత్తికి మాత్రమే ఉండడంతోపాటు తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంబీబీఎస్ చేయించేందుకు తపన పడతారు. కాగా, ఊళ్లో ఎందరు డాక్టర్లు ఉన్నా కొందరి 'హస్తవాసి' మంచిదని పేరొస్తుంది. ఆ 'హస్తవాసి' బాగున్న డాక్టర్ దగ్గరికే క్యూ కడతారు. బహుశా ఆ డాక్టర్ మాటతీరు, వ్యాధిని అంచనా వేసే పద్ధతి, వైద్యం చేసే విధానం హస్తవాసిని తీసుకొస్తుందేమో!

గోదావరి వరదల సమయాన..

ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, తదితర ప్రాంతాల్లో గతేడాది వరదల సమయాన గిరిజనులకు వైద్యం అందించేందుకు వరదలను సైతం లెక్క చేయలేదు డాక్టర్ మౌనిక. చర్ల మండలం సత్యనారాయణపురం పీహెచ్‌సీలో వైద్యురాలైన ఆమె ఏజెన్సీ పల్లెల్లో వైద్యశిబిరం నిర్వహించారు. సత్యనారాయణపురం వైద్యశాలకు 20 కి.మీ. దూరంలోని బట్టిగూడెంలో జ్వరాలు ప్రబలుతున్నాయని తెలియగానే కొంత దూరం మోటార్ సైకిల్‌పై.. అక్కడి నుంచి అడవిలో కాలినడకన తన బృందంతో వాగులను దాటుకుంటూ వెళ్లి గిరిజనులకు వైద్యపరీక్షలు నిర్వహించి భేష్ అనిపించుకున్నారు. ప్రస్తుతం మౌనిక బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యురాలిగా విధులు నిర్వహిస్తున్నారు.


వైద్యుడి నుంచి ఐపీఎస్‌గా..



చిన్నారిని పరీక్షిస్తున్న భద్రాద్రి ఎస్పీ డాక్టర్ వినీత్ (ఫైల్)

భద్రాచలం ఏఎస్పీగా విధులు నిర్వర్తించి, ప్రస్తుతం జిల్లా ఎస్పీగా ఉన్న డాక్టర్ వినీత్ ఎంఎస్ ఆర్థోపెడిక్ వైద్యుడే. బెంగళూరులో మెడిసిన్ పూర్తి చేసుకుని, సంజయ్‌గాంధీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తూనే సివిల్స్‌కు సన్నద్ధమయ్యారు. మొదటి ప్రయత్నంలోనే సివిల్ సర్వీసెస్‌కు ఆయన అర్హత సాధించారు. భద్రాచలం ఏఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న సమయాన దుమ్ముగుడెం పోలీసులు, పర్ణశాల పీహెచ్‌సీ ఆధ్వర్యాన ములకలపల్లిలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఎస్పీగా హాజరైన వినీత్.. వైద్యుడిగా మారిపోయి స్థానికులకు పరీక్షలు నిర్వహించడం విశేషం. ఇక్కడే కాదు ఏ శిబిరంలో సమయం లభించినా వైద్యుడిగా సేవలందించేందుకు వినీత్ ఇష్టపడతారు.

సవాల్‌తో కూడుకున్న విధులు..



గోదావరి వరదల సమయంలో చర్ల మండలంలో గల కొన్ని గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. ఈ సమయంలో ఆయా గ్రామాల్లో నివసించే ఆదివాసీలకు వైద్యం అందించాలనే తపనతో వరదలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. వైద్యురాలిగా ఉండి ప్రజలకు సేవ చేయడం దేవుడి దయగా భావిస్తున్నా. నిత్యం ప్రజలకు వైద్యం అందించే విధంగా నా శాయశక్తులా ప్రయత్నిస్తా.

– డాక్టర్ మౌనిక

క్లుప్తంగా

ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు నిట్‌లో సీట్లు



విద్యార్థులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కారేపల్లి: కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకున్న విద్యార్థులు ఎన్ఐటీల్లో సీట్లు సాధించారని ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలం తెలిపారు. ఈమేరకు శుక్రవారం కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన విద్యార్థులను అభినందించి మాట్లాడారు. తమ కళాశాలలో చదివిన ధరావత్ చేతన్‌కుమార్ తిరుచురాపల్లి, ధరావత్ అరవింద్‌కుమార్ వరంగల్‌లో సీట్లు సాధించగా, అజ్మీరా శశికాంత్ ఐఐటీలో సీటు సాధించే అవకాశముందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు దుర్గాప్రసాద్, పార్థసారథి, వనిత తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టుల శిబిరం ధ్వంసం

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లాలో పోలీసులు మావోయిస్టుల శిబిరాన్ని ధ్వంసం చేశారు. ధనోరా పోలీస్‌స్టేషన్ పరిధి అసనార్–బట్బెడా అటవీ ప్రాంతాల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న సమాచారంతో ఎస్పీ పుష్కర్‌శర్మ నేతృత్వంలో డీఆర్‌జీ, ఐటీబీటీ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. శుక్రవారం బట్బెడ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల శిబిరం సమీపానికి బలగాలు చేరుకోగా.. సెంట్రీ అప్రమత్తం చేయడంతో వారు పారిపోయారు. దీంతో పోలీసులు శిబిరాన్ని ధ్వంసం చేసి మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు.

రెండు రోజులు నీటి సరఫరా బంద్

ఖమ్మం మయూరిసెంటర్: ఖమ్మంలో ఫిల్టర్‌బెడ్ నిర్వహణ, కొత్తగా నిర్మించిన రిజర్వాయర్లకు ఇంటర్ కనెక్షన్లు ఇచ్చే పనులు చేపడుతున్నట్లు మేయర్ పి.నీరజ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శనివారం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు నగరంలో నీటి సరఫరా ఉండదని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

కల సాకారమైన వేళ..



పాల్వంచలో మహిళా రైతుకు పాస్‌బుక్ అందజేస్తున్న మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్, ఎంపీ నామా తదితరులు (ఇన్‌సెట్) సాయిచంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రులు

- పోడు సాగుదారుల్లో హర్షాతిరేకాలు
- జిల్లాలో 6,589 మంది పోడుసాగుదారులకు పాస్ పుస్తకాలు
- మంత్రుల చేతుల మీదుగా పట్టాలు అందుకున్న రైతులు

ఖమ్మంమయూరిసెంటర్: పోడు సాగుదారుల కల సాకారమైంది. ఏళ్లుగా పోడు భూములు సాగు చేస్తున్న రైతులకు హక్కు పత్రాలు దక్కాయి. తెలంగాణ ప్రభుత్వం వారి కలను సాకారం చేస్తూ శుక్రవారం పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. అలాగే, వీరికి రైతుబంధు సాయం కూడా అందించనున్నట్లు ప్రకటించడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ఖమ్మం, సత్తుపల్లి, వైరా, ఇల్లెందు నియోజకవర్గాల పరిధిలో 9 మండలాల్లోని 77 గ్రామ పంచాయతీల్లో 106 ఆవాసాల్లోని 6,589 మందికి 13,139.03 ఎకరాల పోడు సాగు భూమికి హక్కు పట్టాలు, పాస్ బుక్‌లు అందజేయనున్నారు. ఈసందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్ చేతుల మీదుగా పాస్ పుస్తకాలు అందుకున్న రైతుల్లో కొందరి అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

ఆనందంగా ఉంది..



రెండు ఎకరాల పోడు భూమిలో సాగు చేసుకుంటున్నాం. సాగు భూమిపై హక్కు కల్పిస్తూ ప్రభుత్వం పాస్‌బుక్ ఇవ్వడం సంతోషంగా ఉంది. మంత్రుల చేతులపై పాస్‌బుక్ అందుకోవడం చాలా ఆనందంగా ఉంది.

– సౌందర్య, ఈర్లపూడి, రఘునాథపాలెం మండలం

హక్కు పత్రం అందుకున్నా..



పోడు కొట్టుకొని సాగు చేస్తూ హక్కు పత్రం కోసం ఎదురు చూశాం. అయితే, పట్టా వస్తుందనుని అనుకోలేదు. కానీ తెలంగాణ ప్రభుత్వం హయాంలో సాగు చేసుకుంటున్న భూమికి హక్కు పత్రం అందుకున్నా.

– పాయం ఆదిలక్ష్మి, టేకులగూడెం, సింగరేణి

ఎన్నో ఏళ్ల కల సాకారమైంది..



30 సంవత్సరాల నుండి పోడు సాగు చేసుకుంటున్నాం. అప్పటి నుంచే పోడు భూముల హక్కు పత్రాల కోసం ఎదురుచూస్తున్నాం. ఇప్పటికీ మా కల సాకారమైంది. 3.12 ఎకరాలకు పాస్‌బుక్ వచ్చింది.

– ధాటి జ్యోతి, కెప్టెన్ బంజర్, కామేపల్లి మండలం

హక్కు పొందాను..



ఎన్నో ఏళ్లుగా నాలుగెకరాల పోడు కొట్టుకుని సాగు చేసుకుంటున్నాము. హక్కు పత్రాల కోసం అధికారుల చుట్టూ తిరిగాము. పోరాటాలు కూడా చేశాం. ఎట్టకేలకు హక్కు పత్రాలు రావడం సంతోషంగా ఉంది.

– కల్తి రామకృష్ణ, యర్రబోడు, సింగరేణి మండలం

సభకు బస్సులు కేటాయించాలి



మధిర ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న రాంబాబు, నాయకులు



సత్తుపల్లి ఆర్టీసీ డిపో గేట్ ఎదుట ధర్నాలో పిడమర్తి రవి, కొండూరు సుధాకర్ తదితరులు

మధిర/సత్తుపల్లి: కాంగ్రెస్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న తెలంగాణ జనగర్జన సభకు బస్సులు ఇవ్వకుండా ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, డాక్టర్ కోటా రాంబాబు, కొండూరు సుధాకర్ తదితరులు ఆరోపించారు. మధిర, సత్తుపల్లి టీఎస్ఆర్టీసీ డిపోల వద్ద శుక్రవారం వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ చేరిక, భట్టి పాదయాత్ర ముగింపు సందర్భంగా ఆదివారం ఖమ్మంలో భారీ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు ప్రజలు హాజరయ్యేందుకు సభకు బస్సులు కావాలని ఆర్టీసీ అధికారులను అడిగితే ఎస్టిమేషన్ ఇచ్చి, ఇప్పుడు ప్రభుత్వ ఒత్తిడి కారణంగా బస్సులు ఇవ్వడం లేదని ఆరోపించారు. బస్సులు ఇచ్చినా, ఇవ్వకున్నా, చెక్‌పోస్టులు పెట్టినా జనవిస్ఫోటనంతో సభను విజయవంతం చేస్తామన్నారు. తొలుత డీఎంలు యూ.రాజ్యలక్ష్మి, దేవదానంకు వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేమిరెడ్డి లక్ష్మారెడ్డి, యన్నం కోటేశ్వరరావు, చావలి రామరాజు, దేవిశెట్టి రంగారావు, అక్కినపల్లి నాగేశ్వరరావు, యర్రగుంట రమేష్, తాండ్ర తిరుమలరావు, నండ్రు విజయరావు, కపిలవాయి శ్రీనివాసరాజు, కాశీ కోటేశ్వరరావు, డి.మణిబాబు, ఉడతనేని అప్పారావు, సర్పంచ్ ముత్తారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సుజలారాణి, పద్మజ్యోతి, కాటేపల్లి కిరణ్, కృష్ణారావు, నాని, వెంకటేశ్వరరావు, పూర్ణచంద్రారెడ్డి, కోటేశ్వరరావు, గణేష్, రవీందర్‌రెడ్డి, బోసు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

కల్లూరు: ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలను ఖండించిన వ్యక్తిపై దాడి చేయగా కేసు నమోదైంది. కల్లూరుకు చెందిన కొరకొప్పు రామారావు ఎమ్మెల్యే మాదిగలకు ఏం చేయలేదని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశాడు. దీంతో మంచాల కృష్ణ ఖండించగా రామారావు శుక్రవారం ఆయనపై దాడి చేశాడు. పోలీసులకు అందిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

12 బృందాలు.. 48మంది అధికారులు

జీఓ 58 దరఖాస్తులకు పరిశీలనకు నియామకం



సీపీఐ శ్రీనివాసరావు పర్యవేక్షణలో క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఉద్యోగులు

ఖమ్మంఅర్బన్: ప్రభుత్వ భూముల్లో 2020 ఏడాది జూన్ 2కు ముందు ఇళ్లు నిర్మించుకున్న వారి స్థలాలను ఉచితంగా క్రమబద్ధీకరించేందుకు 58 జీఓ విడుదల చేసింది. ఇందులో భాగంగా అందిన దరఖాస్తులను ఖమ్మం అర్బన్ మండలంలో పరిశీలిస్తున్నారు. ఈమేరకు 12 బృందాలను నియమించగా ఒక్కో బృందంలో నలుగురు చొప్పున ఉద్యోగులు విచారణ ప్రారంభించారు. ఈ మండలంలో 6,251 దరఖాస్తు అందగా ఇంటింటికీ వెళ్లి వివరాలు ఆరా తీయడంతో పాటు ఆధార్ కార్డు, విద్యుత్ బిల్లు, ఓటరు కార్డులు పరిశీలిస్తున్నారు. ఈ విచారణ ఇరవై రోజుల్లో పూర్తిచేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలిసింది. మొత్తం 15 నుండి 20 రోజుల్లో పూర్తి చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శరవేగంగా విచారణ పక్రీయ చేపట్టారు. ఇక రఘునాథపాలెం మండలంలో 1,700 దరఖాస్తులు అందగా మూడు బృందాలతో విచారణ చేపడుతున్నారు.

కొత్తగూడెం ఏరియాలో 119 శాతం బొగ్గు ఉత్పత్తి



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం శాలేం రాజు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ కొత్తగూడెం ఏరియాలో జూన్ నెలకు సంబంధించి 119 శాతం బొగ్గు ఉత్పత్తి నమోదైందని ఏరియా జనరల్ మేనేజర్ శాలేం రాజు తెలిపారు. కొత్తగూడెంలోని కార్యాలయంలో శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. జూన్‌లో 9.89 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించగా 11.78 లక్షల టన్నుల ఉత్పత్తి నమోదైందని తెలిపారు. అలాగే, రోడ్డు, రైలు మార్గాల ద్వారా 12.96 లక్షల టన్నులు రవాణా చేసినట్లు వివరించారు. ఏరియాలోని జేవీఆర్‌ఓసీ–2లో 8లక్షల టన్నుల లక్ష్యానికి 9.29 లక్షల టన్నులు, కిష్టారం ఓసీలో 1.50 లక్షల టన్నులకు 2.19 లక్షల టన్నుల ఉత్పత్తి అయిందని తెలిపారు. కాగా, కొత్తగూడెం ఏరియాలో ఇప్పటి వరకు 511 మంది డిపెండెంట్లకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇవ్వగా, ఇంటి రుణాన్ని 352 మందికి మంజూరు చేసినట్లు జీఎం చెప్పారు. సమావేశంలో ఏజీఎంలు రఘురామిరెడ్డి, శామ్యూల్ సుధాకర్, రామకృష్ణ, డీజీఎం యోహాన్, అధికారులు తావురియా, సుధాకర్, సాగర్, నాగరాజు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ కూడా పాటించరా?

- పోలీసులపై భద్రాద్రి జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్ ఆగ్రహం
- సభావేదిక వద్ద వాహనాలు నిలిపేసిన పోలీసులు

పాల్వంచరూరల్: పాల్వంచలోని ఇరుకైన గల్లీలో ఉన్న సుగుణ గార్డెన్స్‌లో శుక్రవారం పోడుపట్టాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావుతో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్ కాన్వాయ్ వాహనాలను ఒక మార్గంలో పోలీసులు అనుమతించారు. మిగిలిన వాహనాలను మరో మార్గంవైపు దారి మళ్లిస్తుండగా మంత్రి వెనుక కాన్వాయ్‌లో వచ్చిన అశ్వారావుపేట ఎమ్మెల్యే ఎం.నాగేశ్వరరావు, గ్రంథాలయ చైర్మన్ దిండిగాల రాజేందర్ వాహనాలను ఎస్ఐలు శ్రీనివాస్, నరేశ్ నిలిపివేశారు. అన్ని వాహనాలు అటువైపు వెళ్తే ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని దారి మళ్లిస్తుండగా రాజేందర్ వాహనం దిగి ప్రజాప్రతినిధుల ప్రొటోకాల్‌ను కూడా పాటించరా అంటూ వాగ్వాదానికి దిగారు. దీంతో పట్టణ ఎస్ఐ వాహనాలను ఆ మార్గంలో వెళ్లేందుకు అనుమతిలించారు.

సాధారణంలో సగం కూడా లేదు...



- జూన్‌లో నమోదైన వర్షపాతం 49.5 మి.మీ.లే
- మధిర, ఎర్రుపాలెం మండలాల్లో మినహా అంతటా లోటు
- వానలు లేక నెమ్మదించిన పంటల సాగు

ఖమ్మంవ్యవసాయం: జిల్లాపై వరుణుడి కటాక్షం కరువైంది. వానాకాలం ప్రారంభమై నెల గడిచినా సాధారణ స్థాయిలో కూడా వర్షాలు కురవలేదు. నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా రాష్ట్రానికి చేరగా.. ఇప్పటికీ రరుతుపవనాల ప్రభావం అంతగా చూపడం లేదు. జూన్ గడిచినా సూర్యప్రతాపం ఇంకా కొనసాగుతూనే ఉండడం గమనార్హం. సరైన స్థాయిలో వర్షాలు లేక పంటల సాగు నీరసించింది. ఇప్పటికే మెట్ట పైర్లతో పచ్చగా కళకళలాడాల్సిన పంట భూములు దుక్కులకే పరిమితమయ్యాయి. వరుణ దేవుడిపై ఆశతో పలుచోట్ల మెట్ట పంటల విత్తనాలను కొందరు రైతులు పొడి దుక్కుల్లో నాటినా ఫలితం కానరాలేదు.

గత ఏడాదే నయం

జిల్లాలో జూన్ నెల సాధారణ సగటు వర్షపాతం 105.2 మి.మీలు. కానీ సగటున 49.5 మి.మీ.ల వర్షపాతమే నమోదైంది. అంటే సగం స్థాయిలో కూడా వానలు కురవలేదు. గత ఏడాది జూన్‌లో 121.4 మి.మీల వర్షపాతం నమోదైంది. గత ఏడాది అధిక వర్షపాతం నమోదైనా ఈసారి ఆ పరిస్థితి లేకుండా నెల గడిచిపోయింది.

లోటు వర్షపాతమే..

నైరుతి రుతుపవనాల ప్రభావం జూన్‌లో అంతగా చూపలేదని చెప్పాలి. మధిర, ఎర్రుపాలెం మండలాల్లో మినహా మిగిలిన అన్ని మండలాల్లో సాధారణ స్థాయిలో కూడా వర్షాలు కురవలేదు. మధిర మండలం సాధారణ వర్షపాతం 89.5 మి.మీలు కాగా 141.4 మి.మీ.లు.. అంటే 58.0 శాతం అధికంగా నమోదైంది. ఇక ఎర్రుపాలెంలో సాధారణ వర్షపాతం 86.2 మి.మీ.లు కాగా 99.6 మి.మీ.. వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. అలాగే, కామేపల్లి మండలంలో 105.1 మి.మీ.కు గాను 93.2 మి.మీ.ల వర్షపాతం నమోదు కాగా, సాధారణ వర్షపాతంగా అధికారులు గుర్తించారు. ఇవి మినహా మిగిలిన అన్ని మండలాల్లో అధిక లోటు వర్షపాతం కింద, లోటు వర్షపాతం కిందే వాతావరణ శాఖ చేర్చింది.

ఊపందుకోని పంటల సాగు

వానలు ఆశించిన స్థాయిలో లేక, మెట్ట పంటలు సాగు చేసే కాలం మించి పోతోంది. సహజంగా జిల్లాలో మే చివర, జూన్ ఆరంభంలోనే మెట్ట పంటలు సాగు చేస్తారు. ప్రధానంగా పత్తి విస్తారంగా సాగవుతుంది. కానీ ఈసారి అన్ని పంటలు కలిసి 6.50 లక్షల ఎకరాల్లో సాగవుతాయని అధికారులు అంచనా వేస్తే.... శుక్రవారం నాటికి జిల్లాలో 78,508 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. పత్తి సహా అన్ని పంటలు తక్కువగా సాగు చేయగా... వరి రైతులు నార్లు పోసి ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉండగా పెసర, పత్తి వంటి పంటల సాగుకు జూలై 20 వరకు అవకాశం ఉందని వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కనీసం 60 మి.మీల వర్షపాతం నమోదైతే విత్తనాలు వేసుకోవాలని చూస్తుండడంతో వరుణుడి కరుణ కోసం ఎదురుచూడడం తప్ప చేసేదేం లేక రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు.

మండలాల వారీగా జూన్‌లో నమోదైన వర్షపాతం (మి.మీ.ల్లో)

మండలం	సాధారణ వర్షపాతం	నమోదైన వర్షపాతం
సింగరేణి	112.3	86.8
కామేపల్లి	105.1	93.2
రఘునాథపాలెం	103.9	33.2
ఖమ్మం రూరల్	102.5	27.2
తిరుమలాయపాలెం	97.4	41.6
కూసుమంచి	94.1	36.8
నేలకొండపల్లి	93.0	28.2
ముదిగొండ	89.2	22.8
చింతకాని	97.5	18.6
ఖమ్మం అర్బన్	105.1	27.0
కొణిజర్ల	112.0	19.6
ఏన్కూరు	131.3	50.8
కల్లూరు	127.9	51.4
పెనుబల్లి	117.0	25.4
సత్తుపల్లి	132.1	34.0
వేంసూరు	98.1	47.0
తల్లాడ	105.0	64.0
వైరా	113.5	39.2
బోనకల్	96.9	51.8
మధిర	89.5	141.4
ఎర్రుపాలెం	86.2	99.6
జిల్లా సగటు	105.2	49.5

* మనం మాట్లాడుకోవాల్సిందే!

అధునికత పేరుతో మన మధ్యలోకి డ్రగ్స్ అనే భూతాలు వచ్చాయి. పబ్ కల్చర్ పెరుగుతున్న ఈ రోజుల్లో అబ్బాయిలే కాదు అమ్మాయిలు కూడా డ్రగ్స్‌కు బానిసలవుతున్నారు. ఈ సమస్య బారిన పడకుండా ఉండాలన్నా, డ్రగ్స్‌కు అడిక్ట్ అయినా మనం మాట్లాడుకోవాల్సిందే!


ప్రతీకాత్మక చిత్రం

డ్రగ్స్‌కు దూరంగా ఉందాం..!

'ఈ దశాబ్దం చివరి నాటికి, ప్రపంచవ్యాప్తంగా డ్రగ్స్ వాడేవారి మోతాదులో దాదాపు 11 శాతం పెరుగుదల ఉంటుంద'ని 'యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్' తన నివేదికలో పొందుపరిచింది. ఇది ఒక సామాజిక సమస్య. మత్తుకు బానిస కావడానికి కారణాలు వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులతో ముడిపడి ఉంటాయి. విద్య, వృత్తి, కుటుంబ ఆదాయం, జెండర్, సామాజిక పోకడలు.. అన్నీ వ్యసనానికి లొంగిపోయే వ్యక్తి ఆలోచనా విధానంపై ప్రభావం చూపుతాయి.

• • •

బర్త్ డే పార్టీ అని వెళ్లిన కూతురు సోనీ (పేరు మార్చడమైనది) రాత్రి నుంచి ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వస్తోంది. తన స్నేహితులను కనుక్కుంటే తెలియదనే సమాధానం వచ్చింది. మూడు నెలలుగా సోనీ ప్రవర్తనలో వచ్చిన మార్పులు అమ్మను తెగ భయపెడుతున్నాయి. ఇదే విషయమై భర్తతో చెప్పింది. సోనీ వారికి ఒక్కతే కూతురు. అడిగినవన్నీ అమర్చిపెట్టగలిగే స్థోమత గల కుటుంబం.

సోనీ బీటెక్ సెకండియర్ చదువుతోంది. ఇంటర్మీడియెట్ వరకు ఇంట్లో ఎంత చెబితే అంత అన్నట్టుగా ఉన్న అమ్మాయి ఒక్కసారిగా ఫ్రెండ్స్ బర్త్ డే అనీ, గెట్ టుగెదర్ అనీ, కాలేజీ ఫ్రెషర్స్ డే అనీ, ఫేర్వెల్ అనీ... ఈ మధ్య పార్టీలు బాగా పెరిగిపోయాయి. పార్టీ అన్నప్పుడల్లా డబ్బులు ఇవ్వక తప్పేది కాదు. ఆమె రావడం ఆలస్యం కావడంతో ఓరోజు ఆమె ఫ్రెండ్స్ ద్వారా ఎంక్వైరీ చేసి, తను ఎక్కడ ఉందో తెలుసుకొని వెతుక్కుంటూ అక్కడికి వెళ్లారు.


ప్రతీకాత్మక చిత్రం

కృత్రిమ ఆనందం

- డ్రగ్స్‌కు అలవాటు పడితే ఏం చెప్పినా వినరు. డబ్బులు ఇవ్వకపోతే దొంగతనం చేయడం, పెద్దవాళ్ల మీద చేయి చేసుకోవడం, ఇంకా చేయకూడని పనులు చేసి ఎలాగైనా సరే డ్రగ్స్ తీసుకుంటారు.
- వాళ్లకి వాళ్ల డ్రగ్స్‌కి మధ్యన ఎవరు వచ్చినా భరించరు. అంటే.. తల్లి, తండ్రీ, స్నేహితులు... ఎవ్వరొచ్చినా తట్టుకోలేరు.
- యూత్‌కి బాగా నచ్చే పదాలు 'కొత్తదనాన్ని ఎక్స్‌పీరియెన్స్ చేయాలి.' దీనివల్లే ప్రతీ డ్రగ్ ని ఎక్స్‌పీరియన్స్ చేయాలనే క్యూరియాసిటీతో వాటిని టెస్ట్ చేస్తారు. ఆ సమయంలో కలిగే 'కృత్రిమ ఆనందం' మళ్లీ మళ్లీ మరింత మత్తు కావాలని కోరుకుంటుంది. దీంతో మోతాదు పెరుగుతుంటుంది.

అక్కడ సోనీ ఉన్న తీరును చూసి తల్లీతండ్రి షాకయ్యారు.

మరో నలుగురు అమ్మాయిలు, అబ్బాయిలు ఉన్నారు. మత్తులో ఉన్నట్టుగా కనిపిస్తున్నారు. అడిగిన దానికి ఎవరూ సరిగా సమాధానం చెప్పడం లేదు. వారి చుట్టూ ఉన్న వాతావరణం, వారి వాలకం చూడగానే అర్థమైపోయింది పిల్లలు ఎలాంటి స్థితిలో ఉన్నారో.

• • •

సోనీని బలవంతంగా ఇంటికి తీసుకువచ్చారు.

నిద్రలేచి, ఫ్రెష్ అయి మళ్లీ బయటకు వెళ్లబోతున్న సోనీని ఆపింది తల్లి.

'బయట కాలు పెడితే ఊరుకోను, ఇంట్లోనే ఉండు' అని గద్దించాడు తండ్రి. .

'నన్ను ఆపడానికి మీరెవరు.. నా ఫ్రీడమ్‌ను ఎందుకు చంపేస్తున్నారు. ఏం చేస్తారో చేసుకోండి. నేను వెళతాను..' అని తండ్రి మీద రివర్స్ అయిపోయి బయటకు వెళ్లిపోయింది.

ఇక అలాగే వదిలేస్తే కూతురు దక్కదనుకున్నారు తల్లీదండ్రీ.

ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనేంత దూరం సమస్యను తీసుకెళ్లకుండా మొదట్లోనే సరైన పరిష్కారం దిశగా అడుగులు వేయడం, నిపుణుల సలహాలు పాటించడం మేలు.

సైకిక్ ఎనర్జీ

'నా జీవితం ఇది. నాకు చెప్పడానికి నీవెవరు? కన్నావు కాబట్టి భరించాల్సిందే' అంటారు. పరువు, ప్రతిష్ఠ, చదువు, కెరియర్.. దేనికీ వాల్యూ ఇవ్వరు. సైకిక్‌లా ప్రవర్తిస్తారు. ఇందులో అబ్బాయిలు/అమ్మాయిలు ఇద్దరూ ఉన్నారు. ఇది డ్రగ్ ఎడిక్షన్ పర్యవసానం అనే నిజాన్ని కుటుంబ సభ్యులు జీర్ణం చేసుకోలేకపోతున్నాయి. మా పిల్లలు అలాంటివారు కాదు అనుకొని సమాధాన పరుచుకుంటారు.

కౌన్సెలింగ్ తప్పనిసరి

తాము ముందు అనుకున్న లక్ష్యాలను పక్కన పెట్టేసి, ఇలాంటి వాటికి పిల్లలు అట్రాక్ట్ అవుతుంటారు. అందుకని, అమ్మాయి/అబ్బాయి ఎవరైనా సరే మత్తు పదార్థాలకు సంబంధించిన ప్రతీ సిచ్యుయేషన్ ని డిస్కస్ చేయాల్సిందే. 'మా అమ్మాయి/అబ్బాయి ఇలా చేస్తుంటే పదిమందికి ఏమని చెప్పుకుంటాం. ఈ సమస్యకు ఎవరి దగ్గరకు వెళ్లాలో కూడా తెలియడం లేదు' అని కుమిలిపోతుంటారు. దీనికి సరైన పరిష్కారం సైకలాజికల్ కౌన్సెలింగ్.

– నిర్మలారెడ్డి

అనుమానించాల్సిందే!

పిల్లల కొన్ని చర్యల వల్ల వాళ్ళు డ్రగ్ అడిక్ట్ అవునా కాదా సులువుగా తెలుసుకోవచ్చు.

- ఎక్కువ డబ్బులు కావాలని అడుగుతుంటారు. తరచూ పార్టీలకు వెళ్లడం, నా రూమ్‌లోకి ఎవరూ రావద్దు ... అని ఐసోలేట్ అవుతుంటారు. రెబల్స్ అవుతారు/రివర్స్ అవుతారు. పగటిపూట పడుకోవడం, రాత్రిళ్లు మేల్కోవడం చేస్తుంటారు. పెదవులు ఆరిపోవడం, చూపులో తేడా రావడంతోపాటు, వారి బాడీ లాంగ్వేజ్‌లోనూ మార్పులు వస్తాయి. ఇంట్లోకి వచ్చిన వెంటనే రూమ్‌లోకి వెళ్లి, తలుపులు వేసేసుకున్నా, నాకు వేరే పని ఉంది, నేను ఇప్పుడే రాను.. లాంటి మాటలు మాట్లాడుతున్నా అనుమానించాల్సిందే. చదువు విషయంలో సరిగ్గా లేకున్నా చెక్ చేయాలి. సరైన గైడెన్స్ ఇప్పించాలి. ఎక్కడైనా తేడా వస్తే.. థెరపిస్ట్ దగ్గరకు తీసుకెళ్లాలి.
- నా జీవితం, నా స్వేచ్ఛ అనే భావన అమ్మాయిలకు/అబ్బాయిలకు వచ్చేసింది. కానీ, స్వేచ్ఛ ఎంత ఇవ్వాలో దానికో పరిమితి ఉండాలి. ఏడాది, రెండేళ్ల పిల్లలు వెలుగుతున్న క్యాండిల్‌ను పట్టుకోవడానికి ఉత్సాహం చూపుతారు. కాలుతుందని మనకు తెలుసు, ఆ పిల్లవాడికి తెలియదు. అలాంటప్పుడు మనం ఎలా ఆపుతామో, ఇదీ అంతే అని గుర్తించాలి. నా పిల్లలను నేను కంట్రోల్ చేయాల్సిందే.. అనుకున్నప్పుడు మానిటర్ చేయాల్సిందే. అందుకు తగిన సపోర్ట్ తీసుకోవాల్సిందే.
- మంచి జీవనశైలి గురించి చెబితే ఎవరూ వినరు. వారి ఆలోచనా విధానమే మారాలి. ఎప్పుడూ మోటివేట్ చేసుకుంటూ వెళ్లాలి. అప్పుడు మంచి ఫలితం వస్తుంది. శారీరకంగా దెబ్బతినడం, కెరియర్ పాడవడం, సామాజికంగా చెడు పేరు రావడం ఇలాంటివన్నీ సమస్యలే కాబట్టి ఆలోచనా విధానాన్ని మార్చేటట్టు చేయాలి. అయితే, ఆలోచనా విధానం మారడానికి మందులు ఉండవు. ఉదాహరణకు.. ఐస్‌క్రీమ్ తింటే పడటం లేదు అంటే, తినడం మానేయాలి, తప్పదు. అలాగే, మనకు చెడు చేసేవి ఏవైనా వదిలేయాల్సిందే.
- మత్తు పూర్తిగా వదిలించుకోవాలంటే అది ఆ వ్యక్తిని బట్టి ఉంటుంది. మారాలనే ఆలోచన బట్టి రికవరీ వేగంగా ఉంటుంది. 'డ్రగ్స్ వల్ల నాకు డ్యామేజీ అవుతుంది అనుకున్నప్పుడు పరిష్కారాన్ని వెతుక్కోవాలి అనిపిస్తుంది. ఆల్కహాల్/డ్రగ్స్ తీసుకుంటే బాడీ వెంటనే రియాక్ట్ అవుతుంది. ఒక్కసారిగా మానేసినా అంతే రియాక్ట్ అవుతుంది. అందుకని, డిటాక్స్ అండ్ విత్‌డ్రాయల్ మేనేజ్‌మెంట్ చేయాల్సి ఉంటుంది. మత్తుకు అలవాటుపడటం ఒక రోగం అని గుర్తించాలి. దాని మీద ఒక అవగాహన ఏర్పరుచుకోవడం, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కౌన్సెలింగ్ విధానాల ద్వారా దాన్ని అధిగమించాలి.



– డాక్టర్ గిడియన్, డి–అడిక్షన్ థెరపిస్ట్
లివింగ్ సోబర్, హైదరాబాద్

నాలుగైదేళ్లొచ్చినా ఇంకా ముద్దు ముద్దుగా మాట్లాడే పిల్లలే మనకు తెలుసు. అలాంటిది రెండేళ్లకే గలగల మాట్లాడుతూ అందరూ ఆశ్చర్యపోయేలా చేశాడా బుడతడు. అంతేనా? తొమ్మిదో ఏటనే "నాది స్కూలు సిలబస్ చదివి, హోం వర్క్ చేసే వయసు కాదు" అని చెప్పి ఏకంగా కాలేజీ పుస్తకాలు చేతబట్టాడు. నాలుగేళ్లలో చకచకా డిగ్రీ పూర్తి చేసేశాడు. ప్రస్తుతం పద్నాలుగేళ్ల వయసులో ఎలాన్ మస్క్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా హార్డ్‌గా పని చేస్తున్నాడు కైరాన్ క్వాజీ.

పద్నాలుగేళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజినీర్!


కైరాన్ క్వాజీ

నేటి టెక్నాలజీ టీనేజర్స్ కొందరు అది ఇది అనిచెబుతూ ఎంజాయ్ చేస్తూ సమయాన్ని వృథా చేస్తుంటే.. కైరాన్‌లాంటి కుర్రాళ్లు మాత్రం వయసుకు మించిన ప్రతిభతో అద్భుతాలు సృష్టిస్తూ ఔరా అనిపిస్తున్నారు. అత్యంత వేగం, కచ్చితత్వంతో కూడిన ప్రతిభా పాటవాలతో ప్రఖ్యాత స్పేస్ ఎక్స్ కంపెనీ రిక్రూట్‌మెంట్ టెస్ట్ పాసైన కైరాన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎంపికవడమేగాక, కంపెనీలోనే తొలి అతిపిన్న ఇంజినీర్‌గా నిలిచాడు.

అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోకు చెందిన జూలియా, ముస్తాహిద్ క్వాజీ దంపతులకు 2009 జనవరి 27 కైరాన్ పుట్టాడు. చిన్నప్పటి నుంచి ఎంతో చురుకుగా ఉత్సాహంగా ఉండే కైరాన్‌ను గమనించిన తల్లిదండ్రులు.. చక్కగా ప్రోత్సహించేవారు. తెలివిగా చదువుతూ ..ఏడో ఏట యంగ్‌వాంక్స్ కోడింగ్ అకాడమిలో చేరి పైథాన్ ప్రోగ్రామింగ్‌ను నేర్చుకున్నాడు. దీంతోపాటు మెషిన్ లెర్నింగ్‌ను కూడా వంటబట్టించుకున్నాడు.


విధి నిర్వహణలో క్వాజీ


తల్లిదండ్రులతో...

తొమ్మిదేళ్లకే కాలేజీ..

నాది స్కూల్ హోం వర్క్ చేసే వయసు కాదని తన ప్రతిభతో తొమ్మిదో ఏటనే లాస్‌పాసిటాస్ కాలేజీలో చేరి ఈ కాలేజీ చరిత్రలో తొలి పిన్న వయసు విద్యార్థిగా చరిత్ర సృష్టించాడు. ఆ తరువాత పదకొండేళ్లకే మ్యాథమేటిక్స్‌లో డిగ్రీ చదువుతూనే శాంత క్లారా యూనివర్శిటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ కూడా చదివాడు. ఇదే యూనివర్శిటీలో ఈ ఏడాది మాస్టర్స్‌ని పూర్తిచేశాడు. ఇటీవల సాంకేతిక ఫన్ ఇంటర్వ్యూ ప్రాసెస్‌ను అవలీలగా అధిగమించి స్పేస్‌ఎక్స్‌లోని స్టార్‌లింక్ విభాగంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎంపికయ్యాడు. దేన్నైనా ఇట్టే పట్టేసే గుణగణాలే కైరాన్‌ని స్పేస్ ఎక్స్ ఉద్యోగిగా మార్చాయి. అందుకే చిన్న వయసులో డిగ్రీలేగాదు, ఉద్యోగాన్ని కూడా కొట్టేశాడు.

ప్రతిభ, పట్టుదల, కృషి ఎక్కువ

"కైరాన్ చిన్నప్పటి నుంచి చాలా చురుకుగా ఉండేవాడు. ఆ చురుకుదనాన్ని వెన్నుతట్టి ప్రోత్సహించేవాళ్లం. దాంతో వాడు తన ప్రతిభాపాటవాలకు మరింత పదును పెట్టుకుని టీనేజ్‌లోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా మారాడు. లాస్‌పాసిటాస్ కాలేజీలో చదివేటప్పుడు అకడమిక్ సిలబస్‌ను నేర్చుకోవడమేగాక, స్టాఫ్ అసిస్టెంట్‌గా, స్టెమ్ ట్యూటర్‌గాను పనిచేసేవాడు. ఇతర ట్యూటర్‌లకు సాయం చేస్తూ తన నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నాడు. వేసవి సెలవుల్లో సైబర్ ఇంటెలిజెన్స్ ఇంటర్న్‌షిప్ చేశాడు. దీనితోపాటు బ్లాక్‌బర్డ్ ఏఐలో కూడా ఏఐ ఇంటర్న్‌గా చేశాడు. శాంతక్లారా యూనివర్సిటీ, ఇంటెల్ మెంటర్స్ కూడా కైరాన్‌కు మంచి గైడెన్స్‌ను అందించారు. చేతిరాత, స్పెల్లింగ్, నోట్ టేకింగ్, ఇతర భాషలు నేర్చుకోవడం కాస్త కష్టమైనా.. పట్టుదల, కృషితో నేర్చుకున్నాడు. ప్రస్తుతం బెంగాలీ, మాండరిన్ నేర్చుకుంటున్నాడు. ఎప్పుడు కొత్తదాన్ని నేర్చుకోవడానికి కైరాన్ ఆసక్తి కనబరుస్తాడు. ఆ ఆసక్తే వాడి భవిష్యత్తుని ఉజ్వలంగా తీర్చిదిద్దుతోంది'' అని కైరా తల్లిదండ్రులు చెప్పుకొచ్చారు.

న్యూస్‌మేకర్


సాబ్రి

మరో స్వర్ణకమలం

సంప్రదాయ నృత్యమంటే ఇష్టం లేని అమ్మాయిని ఆ నృత్యంలో లగ్నం చేసే సినిమా కథ 'స్వర్ణకమలం'. కేరళలో ఇందుకు పూర్తి విరుద్ధమైన కథ జరిగింది. మదరసాలో చదువుకునే ఒక అమ్మాయి కథాకళి పట్ల ఆసక్తితో 80 ఏళ్ల చరిత్ర ఉన్న డాన్స్ స్కూల్‌లో పోరాడి సీటు సాధించుకుంది. కథాకళిలో ముస్లిం అమ్మాయిల ప్రవేశం ఇప్పటి వరకూ లేదు. ఆ నృత్యం నేర్చుకుంటున్న మొదటి అమ్మాయి సాబ్రి.

'చిన్నప్పటి నుంచి కథాకళి చూస్తున్నా. దానికి వేసుకునే మేకప్, దాని కాస్ట్యూమ్స్, ఆ నృత్యవిధానం నన్ను ఆకర్షించాయి. ఎలాగైనా ఆ డాన్స్ నేర్చుకోవాలని చెప్పా. నాన్నకు కూడా ఆ డాన్స్ ఇష్టం. సరే నమ్మా అన్నాడు' అంది సాబ్రి.

ఏడవ క్లాసు పూర్తి చేసిన సాబ్రి ఇప్పుడు తండ్రి నిస్సమ్, తల్లి అనీషాల ప్రోత్సాహంతో కథాకళి నృత్యం నేర్చుకోవడానికి పూనుకుంది. కేరళలోనే కాదు బహుశా దేశంలోనే కథాకళి నేర్చుకుంటున్న తొలి ముస్లిం బాలిక సాబ్రి. అందుకే ఈ అమ్మాయిని అందరూ మెచ్చుకుంటున్నారు. కళకు కులం, మతం భేదం లేదని అంటున్నారు.


డ్యాన్స్ స్కూల్ 'కళామండలం' వద్ద సాబ్రి


డ్యాన్స్ క్లాస్‌లో ...

■ దేవుని గుడిలో చూసి..

సాబ్రి కుటుంబం కొల్లంలో నివసిస్తుంది. తండ్రి నిస్సమ్ ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్. వీరి ఇంటి సమీపంలోనే శ్రీ మహదేవ కోవెల ఉంది. అక్కడ దాదాపు ప్రతి వారం ఏదో ఒక సాయంత్రం కథాకళి నృత్య ప్రదర్శన ఉంటుంది. వృత్తిలో భాగంగా నిస్సమ్ ఆ నృత్య ప్రదర్శన ఫొటోలు తీయడానికి వెళ్లేవాడు. కాలక్షేపంగా ఉంటుందని సాబ్రిని కూడా తీసుకెళ్లేవాడు. 'అలా ఏడేళ్ల వయసు నుంచే నేను కథాకళి నృత్యాన్ని చూస్తున్నాను. ఐదో క్లాసు అయ్యాక ఆ డాన్సును ప్రయివేటు టీచర్ దగ్గరి నుంచి నేర్చుకోవాలనుకున్నాను. కాని కోవిడ్ వల్ల క్లాసులు ఆగిపోయాయి. అదీగాక ఒక ఇన్‌స్టిట్యూట్ నుంచి పరిపూర్ణంగా నేర్చుకోవాలనిపించింది. అందుకే కళామండలంలో చేరాను' అంది సాబ్రి.

■ మగవారికే కథాకళి

కథాకళి నృత్యం ఒక తపస్సు. దాని కోసం జీవితాన్ని అంకితం చేయాలి. స్త్రీల శరీర ధర్మాలు, గృహ ధర్మాలు వారిని పరిపూర్ణంగా ఈ నృత్యంలో నిమగ్నం కాని వ్వవు అనే ఉద్దేశ్యంతో ఈ నృత్యాన్ని ఆది నుంచి పురుషులకే పరిమితం చేశారు. పురుష కళాకారులే కథాకళిలోని స్త్రీల వేషాలను కూడా ధరిస్తారు. ప్రదర్శనను రక్తి కట్టిస్తారు. కథాకళిని పరిరక్షించడానికి కేరళలో ప్రతిష్టాత్మకమైన డాన్స్ ఇన్‌స్టిట్యూట్‌లు ఉన్నాయి. అలాంటి వాటిలో ముఖ్యమైనది త్రిసూర్‌కు దగ్గరగా ఉన్న చెరుతురితి అనే ఊరిలోని 'కళామండలం'. ఇది కథాకళిని బాల్యం నుంచి రెసిడెన్షియల్ పద్ధతిలో నేర్పుతుంది. అంటే ఇక్కడ మామూలు స్కూలు, కథాకళి స్కూలు కలిసి నడుస్తాయి. 90 ఏళ్లుగా నడుస్తున్న ఈ సంస్థలో పూర్తిగా అబ్బాయిలకే ప్రవేశం. అయితే గత సంవత్సరమే అమ్మాయిలు కూడా చేరొచ్చు అని అనుమతి ఇచ్చారు. ఎవరూ చేరలేదు. ఈ సంవత్సరం పది మంది అమ్మాయిలు చేరితే వారిలో ఒకమ్మాయి సాబ్రి.

■ కఠిన శిక్షణ

కళామండలంలో 8 వతరగతిలో చేరిన సాబ్రి ఇక అక్కడే హాస్టల్‌లో ఉండిపోవాలి. ఉదయం 4.30 నుంచి లేచి కథాకళి పాఠాలు నేర్చుకోవాలి. 9.30 నుంచి మళ్లీ స్కూలు పాఠాలు నేర్చుకోవాలి. సాయంత్రం ఊళ్లో ఎక్కడ కథాకళి ప్రదర్శన జరుగుతుంటే అక్కడకు తీసుకెళ్లి చూపిస్తారు. 'కథాకళిలోని ప్రదర్శనలన్నీ హిందూ పురాణాల ఆధారంగా ఉంటాయి. మరి నీకు ఆ పాత్రలు పోషించడంలో ఇబ్బంది ఏమీ లేదా' అంటే 'అలా ఏమీ లేదు' అంటుంది సాబ్రి. తండ్రి నిస్సమ్ కూడా 'మా అమ్మాయి డాన్స్ నేర్చుకోవడంలో కళ అందరూ నేర్చుకునే హక్కు నిరూపితం అయ్యింది. ఈ నృత్యం నేర్చుకోవడంలో మా మతస్థుల నుంచి ఎటువంటి అభ్యంతరం లేదు' అని తెలిపాడు.

ది బాస్ లేడీ

నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్‌ఎస్‌డీ) స్టూడెంట్ అయిన ఆష్క గొరాదియకు బాలీవుడ్‌లో బ్రేక్ రాలేదు. అయితే ఆ అసంతృప్తి ఆమె మాటల్లో ఎప్పుడూ తొంగి చూసేది కాదు. ప్రతి అడుగులో ఆత్మవిశ్వాసం కనిపించేది. ఆ ఆత్మవిశ్వాసమే ఆమెను వ్యాపార రంగం వైపు నడిపించింది. 'రెనీ కాస్మెటిక్స్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఘనవిజయాన్ని సాధించింది...

బాల నటిగా కెరీర్ మొదలు పెట్టింది ఆష్క గొరాదియ. తన ప్రయాణంలో రకరకాల సవాళ్లు, కష్టాలు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. వాటివల్ల పోరాటం ఎలా చేయాలో తనకు తెలిసింది. హిందీ సినిమాల్లో నటిస్తున్న కాలంలోనే హాలీవుడ్ కలలతో అమెరికా వెళ్లింది. అక్కడ పెద్దగా అవకాశాలు రాకపోవడంతో తిరిగి ఇండియాకు వచ్చింది.

బాలీవుడ్ సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసి, ఎన్నో టీవి సీరియల్స్‌లో నటించి 'టీవి స్టార్'గా పేరు తెచ్చుకున్న ఆష్క ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రయాణం మొదలుపెట్టాలనుకుంది. అయితే అది అంత తేలిక కాదనేది తనకు తెలియని విషయమేమీ కాదు. తన కళ్ల ముందే ఎన్నో అనుభవాలు ఉన్నాయి. అయితే అవేమీ తనకు అడ్డు కాలేదు. మొదటి అడుగుగా సొంతంగా ప్రొడక్షన్ కంపెనీ మొదలుపెట్టిన ఆష్క, ఎన్నో సక్సెస్‌ఫుల్ టీవీ షోలు చేసింది. ఆ తరువాత ట్రావెలర్స్ కోసం ఒక మొబైల్ యాప్ వెంచర్‌ను లాంచ్ చేసింది. ఆ తరువాత స్నేహితులతో కలిసి ప్రారంభించిన 'రెనీ కాస్మెటిక్స్' ఆమెను స్టార్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా మార్చింది.

ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఆష్క ఘనవిజయం ఎంతోమంది ఔత్సాహికులకు స్ఫూర్తి ఇచ్చింది. ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలనుకునే వారికి ఆమె చెప్పిన కొన్ని సలహాలు...

కల కనాలి... ముందుకు కదలాలి: ఒకరి నుంచి స్ఫూర్తి పొందిన తరువాత కల శ్రీకారం చుట్టుకుంటుంది. అయితే అది సాకారం కావాలంటే ఆచరణలోకి రావాలి. పనికి సంబంధించి స్థాయిని పెంచుకుంటూ పోవాలి.

అంకితభావం ప్లస్ కష్టం: నటన అయినా వ్యాపారమైనా సక్సెస్ కావాలంటే అంకితభావంతో పాటు బాగా కష్టపడాలి. ఒకవేళ విజయం సాధించకపోయినా మనం కన్న కలకు దూరం కావద్దు. ఓటమి నేర్పే పాఠాలతో ముందుకు వెళ్లాలి. సానుకూల ఆలోచనలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

రిస్క్‌కు భయపడితే రిస్క్: ఈతకొట్టడానికి నీళ్లలోకి దిగిన తరువాత నీళ్లకు భయపడితే ఎలా! వ్యాపారం అన్నాక రిస్క్ ఉంటుంది. అంత మాత్రాన వెనక్కి తగ్గనవసరం లేదు. మూస ఆలోచనలకు భిన్నంగా కొత్తగా ఆలోచిస్తే విజయం మన చెంతకు నడిచొస్తుంది.

కోవిడ్ కల్లోల సమయంలో ఎన్నో వ్యాపారాలలాగే మా వ్యాపారం కూడా దెబ్బతింది. 'ఇక నీకు నటనే దిక్కు' అనేవాళ్లు. అయితే నేనెప్పుడూ నమ్మకం కోల్పోలేదు. మంచిరోజులు వస్తాయని గట్టిగా నమ్మాను. అది నిజమైంది.

నెట్‌వర్క్: నటనకైనా, వ్యాపారానికైనా పదిమందితో పరిచయం ముఖ్యం. ఈవెంట్స్, వర్క్‌షాప్‌లకు హాజరుకావడంతో పాటు ఆన్‌లైన్ కమ్యూనిటీలతో టచ్‌లో ఉండాలి. సామాజిక సంబంధాల ద్వారా కొత్త విషయాలు తెలుస్తాయి. ఆలోచన పరిధి విస్తరిస్తుంది. ముందుకు వెళ్లడానికి కావాల్సిన ధైర్యం లభిస్తుంది.

యుఎస్పీ: 'మా బ్రాండ్ ఇది' అని మాత్రమే కాదు 'మా యూఎస్పీ ఇది' అని గర్వంగా చెప్పుకోగలగాలి. మా బ్రాండ్ విషయానికి వస్తే హై–క్వాలిటీ, గతంలో ఎప్పుడూ చూడని ప్యాకేజీ, పాకెట్–ఫ్రెండ్లీ ప్రైస్ అనేవి మా యూఎస్పీ. మార్కెట్ ప్లేస్‌లకు వెళుతూ ఎప్పటికప్పుడు ట్రెండ్స్ తెలుసుకోవాలి.

ఆష్కకు నటన, యోగా, పోల్ డ్యాన్స్, ట్రావెల్ అంటే ఇష్టం. ఇక ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అనేది వాటికంటే రెండు రెట్లు ఎక్కువ ఇష్టమైనది. సినిమాలు, టీవీ సీరియల్స్‌లో ఆష్క 'బిజినెస్ ఉమన్' పాత్ర ధరించలేదు. అయితే నిజ జీవితంలో మాత్రం ఆమె 'బిజినెస్ ఉమన్'గా అద్భుత విజయాన్ని సాధించింది. 'ది బాస్ లేడీ' అని స్నేహితులతో పిలిపించుకుంటోంది.



"నా నెక్స్ట్ స్టాప్ స్పేస్‌ఎక్స్: ఈ గ్రహంలోనే అత్యంత చక్కని కంపెనీలో స్టార్‌లింక్ ఇంజినీరింగ్ టీమ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేరబోతున్నాను. వయసును బట్టి ఉద్యోగాలలో నియమించే కంపెనీలకు భిన్నంగా, నా ప్రతిభ, పరిపక్వతలను దృష్టిలో పెట్టుకుని స్పేస్‌ఎక్స్ నాకు ఈ ఉద్యోగం ఇచ్చింది" అని తన లింక్డ్ ఇన్ అకౌంట్ ద్వారా కైరాన్ తన కలల జాబ్ గురించి సంతోషంతో చెప్పుకున్నాడు.


ఆష్క గొరాదియ